'మన లోపలి స్వరూపమే మన గురుదేవులు. బయట శరీరం మనం. దాన్ని నడిపే మనసుకి కపట రాహిత్యం, ఇతరులపైన కాక మన లోస్వరూపం మీద దృష్టి నిలపడం, ఇదే సాధన.'

## 128. తృష్ణ

ఓ రాజు తన పరివారంతో ఎడారిలో ప్రయాణిస్తున్నాడు. వారందరికీ దాహంతో గొంతులు ఎండిపోయాయి. ఎంత వెదికినా వారికి నీటి జాడ దొరకలేదు. అక్కడక్కడా దాహంతో మరణించిన వారి అస్థిపంజరాలు కూడా కనబడ్డాయి. మంత్రికి ఓ ఆలోచన రావడంతో రాజుతో చెప్పాడు.

"రాజా! మనం పట్టుకున్న ఎడారి దుప్పులని వదులుదాం. దాహంతో వున్న అవి నీటి జాడ కనుక్కుని అక్కడికి తప్పక వెళ్తాయి."

దుప్పులని వదలగానే అవి నీటిని పసికట్టి అటువైపు పరుగులు తీసాయి. వాటి వెనకే వెళ్ళిన రాజు, ఆయన పరివారం తమ దాహాన్ని తీర్చుకున్నారు. రాజు వెంటనే ఓ రాతిఫలకం మీద ఇలా చెక్కించి దాన్ని అక్కడ ప్రతిష్టించాడు.

'దుప్పి నీటివాగు కోసం ఆశపడేంత గాఢంగా ఓ దేవా! నా మనసు నీ కోసం తృష్ణతో తపన పడేలా అనుగ్రహించు.'

## 129. స్వర్గార్హత

అనేక పాపపు పనులుతో ఎంతో సంపాదించిన ఒకతనికి చికిత్స లేని రోగం ఒకటి పట్టుకుంది. తను కొద్ది రోజుల్లో మరణించబోతున్నానని తెలీగానే అతని ఆలోచనలు మరణానంతర స్థితి మీదకి మొదటిసారిగా మళ్ళాయి. అతను ఓ గురువు దగ్గరకి వెళ్ళి వినమ్రంగా అడిగాడు.

"స్వామీ! నా మరణానంతరం నేను స్వర్గానికి వెళ్ళడం ఎలాగో దయచేసి చెప్తారా?"

"ఏముంది? పందుల కొట్టంలోకి వెళ్ళి, మోకాళ్ళ మీద కూర్చుని నీ తప్పులని క్షమించమని వాటిని ప్రార్థిస్తే సరి." సూచించాడు గురువు

"ఛ! నేనా పని ఎలా చేయగలను? నా బంధు మిత్రులు, ఇరుగు పొరుగు ముందు నాకు సిగ్గుగా వుండదా?"

వారం రోజుల తర్వాత అతను తిరిగి ఆ గురువుని కలిసి అడిగాడు.

"మీరు చెప్పినట్లు చేస్తే నేను తప్పక స్వర్గానికి వెళ్తానా?"

"వెళ్తావు." హామీ ఇచ్చాడు గురువు.

"అయితే సరే." అని అతను బయటకి వెళ్ళబోతూంటే వెంటనే గురువు అతనితో ఇలా చెప్పాడు.

"పందుల్ని ప్రార్థిస్తే ఇతరులు నిన్ను చూసి నవ్వుతారన్న అహం నీలో చచ్చింది. అది చాలు నువ్వు తప్పక స్వర్గానికి వెళ్ళడానికి. ఇక వాటిని ప్రార్థించనవసరం లేదు."

## 130. ప్రశ్న - జవాబు

రామ శర్మ, కృష్ణ వర్మలు ఇద్దరూ దైవ భక్తులు. వారిద్దరికీ సిగరెట్ తాగే అలవాటుంది. దాంతో తమకి వున్న చెడ్డ అలవాటు వల్ల జరిగే అనర్థం గురించి తెలుసుకోడానికి రామ శర్మ వెళ్ళి మఠంలోని స్వామిని అడిగాడు.

"స్వామీ! నేను శివపంచాక్షరీ మంత్రం జపిస్తూండగా సిగరెట్ తాగచ్చా?"

"ఊహు. అలా చేస్తే అది మన దైవాన్ని అవమానించడమే అవుతుంది."

రామ శర్మ ఆ సమాధానాన్ని వచ్చి కృష్ణ వర్మకి చెప్పి చెప్పాడు.

"మనం జపమైనా మానాలి. లేదా సిగరెట్లయినా మానాలి."

కృష్ణ వర్మ వెంటనే మఠానికి వెళ్ళి స్వామిని అడిగాడు.